సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 10 । జూలై । 2025



శిథిల బడి.. సమస్యల ఒడి!

చర్ల మండలం చింతగుప్పలోని గిరిజన ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరగా ఓ ఇంట్లో తరగతులు నిర్వహిస్తున్నారు. 8లో



ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య అన్నారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 32° / 25°

జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై చిరు జల్లులు కురుస్తాయి.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలంటౌన్‌: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు దమ్మక్క సేవా యాత్ర

భద్రాచలంటౌన్‌: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం దమ్మక్క సేవా యాత్ర నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆషాఢ శుద్ధ పూర్ణిమ సందర్భంగా నేడు ఉదయం 10 గంటలకు గిరిజన పెద్దలు, కళాకారుల నృత్యాల నడుమ దమ్మక్క సేవా యాత్ర సాగుతుందని వివరించారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా వెంకటాపురంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో భద్రాద్రి శ్రీసీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బీఈడీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంటౌన్‌: భద్రాచలంలోని గిరిజన బీఈడీ కళాశాలలో రెగ్యులర్ బీఈడీ కోర్సు (2025–27)లో ప్రవేశానికి ఏజెన్సీ షెడ్యూల్ ప్రాంత గిరిజన పట్టభద్రుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. డిగ్రీ కనీసం 40శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన తెలంగాణలోని గిరిజన అభ్యర్థులు అర్హులని, డిగ్రీ మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుందని వెల్లడించారు. మొత్తం 100 సీట్లలో మహిళలు, ప్రత్యేక కేటగిరీ వారికి రిజర్వేషన్ ఉంటుందని తెలిపారు. ఏటూరు నాగారం, ఉట్నూరు, మన్ననూరు ఐటీడీఏ కార్యాలయాలతో పాటు భద్రాచలం గిరిజన బీఈడీ కళాశాలలో దరఖాస్తులు తీసుకుని, ఆగస్టు 8వ తేదీ వరకు అందజేయాలని, వివరాలకు 89784 77345 నంబర్‌లో సంప్రదించాలని పీఓ సూచించారు.

సింగరేణిలో ఏడుగురు సివిల్ అధికారుల బదిలీ



సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఏడుగురు సివిల్ అధికారులను బదిలీ చేస్తూ ఈఈ సెల్ హెచ్‌ఓడీ ఏజే మురళీధర్ రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్టీపీపీ డీజీఎం జి.శివప్రసాద్‌ను మణుగూరు డీజీఎంగా, కార్పొరేట్ విజిలెన్స్ డీజీఎం జి.రాంచందర్‌ను ఎస్టీపీపీ డీజీఎంగా, మణుగూరు ఏరియా ఎస్ఈ బీవీఎన్ పాత్రుడును ఎస్టీపీపీకి, ఆర్జీ–3 ఏరియా ఎస్ఈ పి.రాజేంద్రప్రసాద్‌ను కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాకు, కార్పొరేట్ సివిల్ హెచ్‌ఓడీ (డివైఎస్ఈ) శ్రీనాథ్‌ను విజిలెన్స్ కార్పొరేట్‌కు, కార్పొరేట్ సివిల్ హెచ్‌ఓడీ (ఏఈ) పప్పి ప్రజ్వలను ఇల్లెందు ఏరియాకు, కార్పొరేట్ ఏరియా మేనేజ్‌మెంట్ ట్రైనీ రామ్‌చరణ్‌ను మణుగూరు ఏరియాకు బదిలీ చేశారు. వీరంతా ఈనెల ఈనెల 15వ తేదీ లోగా ఆయా స్థానాల్లో చేరాలని పేర్కొన్నారు.

కేబినెట్ ఆమోదిస్తేనే..



పురుషోత్త పట్నంలోని రామాలయ భూమి

రామాలయ భూముల్లో సింహభాగం ఆంధ్రప్రదేశ్‌లోనే

- భూముల అప్పగింతకు చొరవ చూపని ఏపీ ప్రభుత్వం
- భద్రాచలం చుట్టూ ఏపీకి చెందిన ప్రాంతమే..
- ఐదు పంచాయతీల విలీనమే భూ సమస్యకు పరిష్కారం
- ఈ అంశంపై కొరవడిన తెలంగాణ సర్కారు కార్యాచరణ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాచలానికి రెండున్నర కిలోమీటర్ల దూరంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారికి సుమారు 900 ఎకరాల భూమి ఉంది. ఏపీలోని పురుషోత్తపట్నం గ్రామపంచాయతీ పరిధిలోని ఈ భూముల్లో కొంత భాగమే దేవస్థానం ఆధీనంలో ఉండగా, అత్యధిక భూమిని ఏపీకి చెందిన స్థానిక రైతులు ఆక్రమించుకున్నారు. ఆలయ భూముల్లో వివిధ పంటలతో పాటు జామాయిల్ సాగు చేస్తున్నారు. ఈ భూములు తమవేనని స్థానిక రైతులు.. కాదు దేవస్థానానివేనని ఆలయ వర్గాల నడుమ కొన్నేళ్లుగా వివాదం నడిచింది. చివరకు ఈ భూములు ఆలయానికి చెందినవేనని హైకోర్టు ఇటీవల తీర్పు చెప్పింది. దీంతో భూముల స్వాధీనానికి ప్రయత్నించిన ప్రతీసారి ఉద్రిక్తత చోటుచేసుకుంటోంది. ఈ క్రమంలో ఆలయ భూముల్లో జరుగుతున్న నిర్మాణ పనులు అడ్డుకునేందుకు మంగళవారం వెళ్లిన ఈఓ రమాదేవిపై అక్కడి రైతులు దాడి చేయడంతో రెండు రాష్ట్రాల మధ్య నానుతున్న ఈ సమస్య మరోసారి తీవ్ర చర్చకు దారి తీసింది.



ఆలయ భూమిగా తెలుపుతూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

డిమాండ్లకే పరిమితం..

రాష్ట్ర విభజన సమయంలో భద్రాచలం గ్రామ పంచాయతీని తెలంగాణలో ఉంచగా పట్టణ శివారులో ఉన్న గ్రామాలు ఏపీలో విలీనమయ్యాయి. దీంతో టెంపుల్ టౌన్‌గా ఉన్న భద్రాచలం పట్టణానికి స్థల సమస్య ఏర్పడింది. భద్రాచలం ఆలయ భూములతో పాటు ఇక్కడున్న స్థలాల కొరత సమస్యను అధిగమించేందుకు ఏపీలో ఉన్న యటపాక, గుండాల, పురుషోత్తపట్నం, కన్నాయిగూడెం, పిచుకలపాడు గ్రామపంచాయతీలను కూడా తెలంగాణలో కలపాలనే డిమాండ్ తరచుగా వినిపిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఈ అంశాన్ని అసెంబ్లీలో కూడా ప్రస్తావించారు. ప్రస్తుత మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సైతం వీలు చిక్కినప్పుడల్లా భద్రాచలం సమీపంలో ఏపీలో ఉన్న గ్రామాలను తెలంగాణలో కలపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఎంపీ బలరాంనాయక్ అయితే ఏపీలో కలిసిన ఏడు మండలాలను తిరిగి తెలంగాణకు కేటాయించాలని అంటున్నారు.

విలీనం జరిగితేనే..

పురుషోత్తపట్నంలో ఉన్న 889 ఎకరాలు తెలంగాణ దేవాదాయ శాఖకు స్వాధీనం చేస్తే.. దేవస్థానం అవసరాలకు తగ్గట్టుగా పంటలు సాగు చేసే అవకాశం స్థానిక రైతులకే ఇస్తామని ఆలయ అధికారులు ఇప్పటికే హామీ ఇచ్చారు. అయినా ఆ భూములు అప్పగించే అంశంపై ఏపీ సర్కారు నుంచి కనీస మద్దతు లేదు. పైగా 'తెలంగాణ వారికి మా భూములతో సంబంధం ఏంట'నే ప్రశ్నలు సంధిస్తూ అధికారులపై దాడులకు దిగే పరిస్థితి వచ్చింది. ఇప్పటికైనా దేవస్థానంతో పాటు భద్రాచలంపై ఆధారపడే స్థానిక గిరిజనుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఏపీలోని ఐదు గ్రామపంచాయతీలను తెలంగాణలో విలీనం చేసే అంశంపై రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కేంద్ర సర్కారు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. కనీసం ఆలయ భూములు స్వాధీనం చేసుకునే అంశంలోనైనా ఏపీ ప్రభుత్వంపై నలువైపులా ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత తెలంగాణ సర్కారుపై ఉంది.

తెలంగాణ ప్రభుత్వ విధానమేంటి ?

ఏపీలో విలీనమైన ఐదు గ్రామపంచాయతీలను తిరిగి తెలంగాణలోకి తీసుకురావాలనే అంశంపై ఏపీ, కేంద్ర ప్రభుత్వాలతో ఎలా వ్యవహరించాలనే విషయాలపై రాష్ట్ర సర్కారు తరఫున 11 ఏళ్లుగా కచ్చితమైన రోడ్‌మ్యాప్ కరువైంది. భద్రాచలం చుట్టూ ఉన్న గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాలంటూ కేబినెట్‌లో చర్చించి ఆమోదం తెలపడం, అసెంబ్లీలో వివిధ పార్టీల అభిప్రాయాలు తీసుకుని విలీనానికి అనుకూలంగా తీర్మానం చేయడం వంటి పనులపై ఇప్పటి వరకు కనీస చర్చ జరగలేదు. శ్రీరామనవమి ఏర్పాట్లు, గోదావరి వరదల సమీక్ష, ఆలయ భూముల వివాదం వంటి సందర్భాల్లోనే సరిహద్దు గ్రామాల విలీనంపై ప్రజాప్రతినిధులు స్పందిస్తున్నారు తప్పితే ఈ సమస్యపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఏంటనే స్పష్టత కరువైంది.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

అశ్వాపురం: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని ఐటీడీఏ పీఓ రాహుల్ అన్నారు. మండలంలోని గొందిగూడెం ఆశ్రమ పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు బోధిస్తున్న పాఠ్యాంశాలను పరిశీలించి, మూడు నుంచి ఐదు తరగతుల విద్యార్థులతో ఇంగ్లిష్ పదాలను బోర్డుపై రాయించారు. తరగతి గదిలో కూర్చుని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. ప్రతిరోజూ మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ఇంగ్లిష్ పదాలు బోర్డుపై రాయించి తెలుగులో అర్థాలు చెప్పేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. వ్యాస రచన, క్విజ్, నాటికలు, ఏకపాత్రాభినయం వంటి వాటిపై పిల్లలకు అవగాహన కల్పించాలని, వర్షాకాలం నేపథ్యంలో వారి ఆరోగ్యంపై దృష్టి సారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చందు, వార్డెన్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న రాహుల్

కంప్యూటర్ విద్యపై పట్టు సాధించాలి

డీఈఓ వెంకటేశ్వరా చారి

మణుగూరు రూరల్ : విద్యార్థులు చదువుతో పాటు కంప్యూటర్ విద్యపైనా పట్టు సాధించాలని డీఈఓ వెంకటేశ్వరాచారి అన్నారు. మండలంలోని బాపూజీనగర్ ఎంపీపీఎస్‌లో ఏర్పాటుచేసిన కంప్యూటర్ ప్రయోగశాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జీవితంలో ఎదిగేందుకు విద్య గొప్ప ఆయుధంలా పని చేస్తుందన్నారు. అనంతరం భవిత కేంద్రంలో రూ.2 లక్షలతో కొనుగోలు చేసిన ఫర్నిచర్, బోధన సామగ్రిని పరిశీలించారు. దివ్యాంగ పిల్లలకు చక్కని బోధన అందించాలని సమ్మిళిత విద్య రిసోర్స్ పర్సన్లకు సూచించారు. జిల్లాలోని 17 మండలాల్లో భవిత కేంద్రాలకు అనుమతులు మంజూరయ్యాయని, ఈ కేంద్రాల ద్వారా దివ్యాంగ పిల్లలకు చదువుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

14న నవోదయ ప్రారంభం..

కరకగూడెం: కరకగూడేనికి మంజూరైన జవహర్ నవోదయ విద్యాలయాన్ని ఈనెల 14న ప్రారంభించనున్నట్లు డీఈఓ వెంకటేశ్వరాచారి తెలిపారు. బుధవారం ఆయన కరకగూడెం జెడ్పీ పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. దేశంలోనే అత్యంత నాణ్యమైన విద్యను అందించే జవహర్ నవోదయ విద్యాలయం జిల్లాకు రావడం అదృష్టమన్నారు. ఆయా కార్యక్రమాల్లో సీఎంఓ సైదులు, ఏఎంఓ నాగరాజశేఖర్, ఎంఈఓలు జి స్వర్ణజ్యోతి, వీరస్వామి, మంజుల, సాంబాయిగూడెం కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎం.శ్రీలత, ఎమ్మార్పీలు ఎం. విష్ణు, పి. బాలరాజు, పి. రామకృష్ణ, కె. రాంబాబు, ఐ. బాలాజీ, ఐ. రమేష్, టి శ్రీకాంత్, పాఠశాల హెచ్‌ఎం బ్రహ్మయ్య, బి.విజయ, ఏఏపీసీ చైర్మన్ ఉత్తమకుమారి, సమ్మిళిత రిసోర్స్ పర్సన్లు నాగశ్రీ, శ్యామ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరా చారి

ఆధార్ సవరణకు పోటెత్తారు..





ఆధార్ నమోదుకు భారీగా తరలివచ్చిన ప్రజలు (ఇన్‌సెట్) క్యూలైన్‌లో వేచి చూస్తున్న మహిళలు

- ఊహించని స్పందనతో అధికారుల ఉక్కిరిబిక్కిరి
- సుదూర ప్రాంతాల నుంచి వచ్చి ఇబ్బంది పడిన ప్రజలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఆధార్‌కార్డులో సవరణలు ఉంటే బుధ, గురువారాల్లో కలెక్టరేట్‌లో నిర్వహించే మెగా ఆధార్ క్యాంపునకు రావాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో అధికారులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో 21 ఆధార్ సవరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే మెగా ఆధార్ క్యాంపునకు అధికారులు ఊహించని స్పందన లభించింది. బుధవారం ఉదయం నుంచే వివిధ ప్రాంతాల నుంచి పిల్లాపాపలతో సహా వేల సంఖ్యలో ఐడీఓసీకి చేరుకున్నారు. వారిని అదుపు చేయడం పోలీసుల వల్ల కూడా కాలేదు. వేల సంఖ్యలో ప్రజలు హాజరు కాగా, వందల సంఖ్యలోనే లోపలికి అనుమతించడంతో బయట ఉన్నవారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సరైన ఏర్పాట్లు చేయకుండా తమను ఇబ్బంది పెట్టడం ఏంటని ప్రశ్నించారు. రెండు రోజులు మాత్రమే గడువు ఉండడంతో అన్ని పనులు మానుకుని వచ్చామని, ఇప్పుడు లోనికి పంపించకపోవడమేంటని నిలదీశారు. భారీగా వచ్చిన ప్రజల నుంచి నిరసన స్వరం వెల్లువెత్తడంతో అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఇంత స్పందన వస్తుందని ఊహించలేదని, ప్రతీ మండలంలో ఆధార్ సవరణ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపడతామని ప్రకటించారు.

17 వరకు మండలాల వారీగా..

కలెక్టరేట్‌లో నిర్వహించిన మెగా ఆధార్ క్యాంపునకు విశేష స్పందన లభించిందని, ఈ నేపథ్యంలో ఈనెల 17 వరకు మండలాల వారీగా క్యాంపులు నిర్వహించాలని నిర్ణయించామని అదనపు కలెక్టర్ వెల్లడించారు. 10, 11వ తేదీల్లో కలెక్టరేట్‌లో కొత్తగూడెం, పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్, జూలూరుపాడు, చంద్రుగొండ, మండలాల వారికి శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 14, 15, 16 తేదీల్లో భద్రాచలం ఆర్డీఓ కార్యాలయంలో భద్రాచలం, బూర్గంపాడు చర్ల, దుమ్ముగూడెం, ఇల్లెందు మున్సిపల్ కార్యాలయంలో ఇల్లెందు, టేకులపల్లి, ఆళ్లపల్లి, గుండాల మండలాల వారికి క్యాంపులు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అలాగే 15, 16, 17 తేదీల్లో దమ్మపేట ఎంపీడీఓ కార్యాలయంలో దమ్మపేట, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి, అశ్వారావుపేట మండలాల వారికి, మణుగూరు ఎంపీడీఓ కార్యాలయంలో మణుగూరు, అశ్వాపురం, పినపాక, కరకగూడెం మండలాల వారికి ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రతీ కేంద్రంలో అవసరానికి తగినన్ని ఆధార్ కిట్లు అందుబాటులో ఉంచాలని, ప్రజలకు వేగవంతంగా సేవలందించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజల ఆధార్ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు నిరంతరం క్యాంపులు నిర్వహిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో హైదరాబాద్ రీజియన్ యూఐడీఏ అసిస్టెంట్ మేనేజర్ మహ్మద్ సాభన్, జిల్లా ఇ– డిస్ట్రిక్ మేనేజర్ సైదేశ్వరరావు, మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు రమ్మంటే తిరిగి వెళ్తున్నాం



అధిక సంఖ్యలో జనం రావడంతో లోపలికి అనుమతించలేదు. మా బాబు రోహన్‌రుషికి ఆధార్‌కార్డు చేయిద్దామని వచ్చాను. మళ్లీ రేపు రమ్మని అధికారులు చెప్పడంతో తిరిగి వెళ్లిపోతున్నాం.

– బోడా బాబులాల్, పాపకొల్లు, జూలూరుపాడు మండలం

కష్టపడి వచ్చినా ఫలితంలేదు



ఆధార్ సవరణ కోసం కలెక్టరేట్‌కు వచ్చాను. సమ్మె జరుగుతున్నా కష్టపడి ఇక్కడి దాక వస్తే ఫలితం దక్కలేదు. అధిక సంఖ్యలో జనం రావడంతో లోపలకు అనుమతించడం లేదు.

– బొమ్మగాని జ్యోతి, ఇల్లెందు

మా బాబుకు నమోదు చేసుకున్నాం



మా బాబు రోషన్‌కు ఆధార్ కార్డు చేయించుకున్నాం. అవకాశం కల్పించిన కలెక్టర్‌కు ధన్యవాదాలు. ఉదయాన్నే రావడం వల్ల మా పని సులువుగా పూర్తయింది.

– కె. శ్రీను, భాగ్యలక్ష్మి, దుమ్ముగూడెం

విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యం

విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ వేణుగోపాల చారి

టేకులపల్లి : టీజీఎన్‌పీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యమని వినియోగదారుల ఫోరం చైర్మన్ ఎస్.వి.వేణుగోపాలచారి అన్నారు. బొమ్మనపల్లి, టేకులపల్లి, లక్ష్మీదేవిపల్లి సెక్షన్ల వినియోగదారులకు బొమ్మనపల్లి సబ్ స్టేషన్ ఆవరణలో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. భద్రాద్రి కొత్తగూడెం సర్కిల్‌లో సమస్యలు పెండింగ్‌లో లేవని చెప్పారు. రహదారుల వెంట, పొలాల్లో, జన సమూహం అధికంగా ఉండే ప్రాంతాల్లో లూజు వైర్లు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పశువుల కాపర్లు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద జాగ్రత్తగా ఉండాలని అన్నారు. అనంతరం విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు, ఓల్టేజీలో హెచ్చుతగ్గులు తదితర సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించి సత్వరమే పరిష్కరించారు.



సదస్సులో మాట్లాడుతున్న వేణుగోపాల చారి

బాధితుడికి రూ.80 వేల చెక్కు పంపిణీ..

ములకపల్లి మండలం మాధారాం పంచాయతీ రామాంజనేయపాలెం గ్రామానికి చెందిన వేముల కృష్ణమూర్తికి చెందిన ఆవు గతేడాది ఏప్రిల్‌లో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. కాగా, కృష్ణమూర్తి నష్టపరిహారం కోసం దరఖాస్తు చేసుకుని సంవత్సరం దాటినా పరిహారం అందలేదని సదస్సులో వినతిపత్రం అందించగా వెంటనే స్పందించిన ఎస్‌ఈ మహేందర్.. రూ.80 వేల చెక్కును బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు కె. రమేష్, ఎస్. దేవేందర్, ఎం. రామారావు, డీఈ రంగస్వామి, ఏడీఈ హేమచందర్‌రావు, ఏఈలు దేవా, బుజ్జికన్నయ్య, రాఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక వినియోగదారులకు మెరుగైన సేవలు..

పాల్వంచ: పారిశ్రామిక విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తామని ఎస్ఈ జి.మహేందర్ అన్నారు. నవభారత్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వినియోగదారులకు సరఫరా వ్యవస్థలో పవర్ ఫ్యాక్టర్ అంశాలు, దాని ప్రభావాలు, మెరుగుదల పద్ధతులు, లీడింగ్ పవర్ ఫ్యాక్టర్, అన్ బ్లాక్ తొలగించడం వంటి వాటిని వివరించారు. కార్యక్రమంలో సింగరేణి, ఐటీసీ, నవభారత్ సంస్థల అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి సమ్మె పోటు



సమ్మెతో కొత్తగూడెం బస్టాండ్‌లో నిలిచిన బస్సులు

డిపోలకే పరిమితమైన ఆర్టీసీ బస్సులు

చుంచుపల్లి : కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమ్మె ఆర్టీసీలో విజయవంతమైంది. కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు ఆర్టీసీ డిపోల్లో పని చేస్తున్న కార్మికులు ఉదయం నుంచే విధులు బహిష్కరించి స్వచ్ఛందంగా పాల్గొన్నారు. దీంతో జిల్లాలో పరిమిత సంఖ్యలో మాత్రమే బస్సులు నడిచాయి. భద్రాచలం డిపోలో మాత్రం సమ్మె ప్రభావం అంతగా కనిపించలేదు. అక్కడ దాదాపు 70 శాతం సర్వీసులు పూర్తి స్థాయిలో రోడ్డెక్కాయి. కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు డిపోల్లో 10 శాతం బస్సులు మాత్రమే తిప్పారు. ఆర్టీసీ కార్మిక సంఘాలతో పాటు వివిధ పార్టీల నాయకులు ఉదయమే డిపోల వద్దకు చేరుకుని బస్సులను అడ్డుకున్నారు. అద్దె బస్సుల యజమానులు సైతం పూర్తిస్థాయిలో సమ్మెకు మద్దతు తెలిపారు. సమ్మె నేపథ్యంలో హైదరాబాద్, ఖమ్మం, ఇల్లెందు, వరంగల్, గోదావరిఖని, మణుగూరు, భద్రాచలం ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. కొందరు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. ఇక ఏపీకి చెందిన బస్సు సర్వీసులకు మాత్రం ఎలాంటి ఆటంకం కలగలేదు. సమ్మెతో నాలుగు డిపోల పరిధిలో దాదాపు రూ.22 లక్షల మేర నష్టం వాటిల్లినట్టు అధికారులు అంచనా వేశారు.



కొత్తగూడెం బస్టాండ్‌లో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

సింగరేణిలో సమ్మె సక్సెస్

- స్వచ్ఛందంగా పాల్గొన్న 80 శాతం మంది కార్మికులు
- నైట్ షిఫ్ట్ కార్మికులతో ఓసీల్లో పని చేయించిన యాజమాన్యం
- యార్డ్‌కోల్‌ను ఉత్పత్తిగా చూపిన అధికారులు



సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో జాతీయ కార్మిక సంఘాలు బుధవారం నిర్వహించిన సమ్మె సింగరేణిలో విజయవంతమైంది. సంస్థవ్యాప్తంగా గల 11 ఏరియాల్లోని గనులు, డిపార్ట్‌మెంట్లలో పనిచేస్తున్న కార్మికుల్లో అత్యవసర విభాగాలకు చెందిన 20 శాతం మినహా మిగిలిన 80 శాతం మంది స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొన్నారు. మొత్తం 18 ఓసీల్లో రోజుకు 14 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికితీయాల్సి ఉండగా పూర్తిగా స్తంభించినట్టు సమాచారం. కాగా, యాజమాన్యం మంగళవారం రాత్రి షిఫ్టుకు హాజరైన కార్మికుల(ఆపరేటర్ల)తో బుధవారం కూడా పనులు చేయించింది. అంతేకాక సమ్మెతో నిలిచిపోయిన బొగ్గు ఉత్పత్తి స్థానంలో వర్షాకాలం దృష్ట్యా నిల్వచేసిన యాడ్‌కోల్‌ను చూపిస్తోందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. సమ్మె సందర్భంగా కొత్తగూడెంలో ఐఎఫ్‌టీయూ, జేఏసీల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. హెడ్డాఫీస్‌కు వెళ్లే ఉద్యోగులను అడ్డుకున్నారు. ఈ సమ్మెతో కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలగాలన్నారు. ప్రధాని నరేంద్రమోడీ కార్మిక చట్టాలను రద్దుచేసి లేబర్‌కోడ్‌లను తీసుకురావడం, 8 గంటల పని విధానాన్ని 10 గంటలకు పెంచడం దుర్మార్గమన్నారు.

క్లుప్తంగా

కుల బహిష్కరణ అవాస్తవం



మాట్లాడుతున్న పాతపూసపల్లి గ్రామస్తులు

ఇల్లెందురూరల్: మండలంలోని పాతపూసపల్లిలో పలువురిని కుల బహిష్కరణ చేసినట్లు వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని గ్రామపెద్దలు వర్స అవినాష్, సూర్నపాక వెంకటనారాయణ, తెల్లం శ్యాం, కుంజ వీరస్వామి, వర్స పుల్లయ్య స్పష్టం చేశారు. గ్రామంలో బుధవారం వారు మాట్లాడుతూ.. తమపై ఆరోపణలు చేసిన వ్యక్తులు కొత్తపూసపల్లి వాసులని, గ్రామంతో సంబంధం లేని వ్యక్తులను తాము కుల బహిష్కరణ చేశామని ఆరోపించడం గర్హనీయమన్నారు. గతంలో తమ గ్రామంలో పార్టీ విస్తరణకు సీపీఎం నేతలు ప్రయత్నిస్తే తిరస్కరించగా, కాంగ్రెస్‌లో కొనసాగుతున్న తమపై తప్పుడు ఫిర్యాదు చేస్తున్నారని వెల్లడించారు. సమావేశంలో గ్రామస్తులు సూర్నపాక రామారావు, ఈసం కృష్ణ, సూర్నపాక సుజాత, సోది మహేశ్, కల్తి వినోద్, సూర్నపాక సత్యనారాయణ, సోది హరీశ్, కుంజ సందీప్, కుంజ మోహన్, వర్స ఆనంద్, కల్తి సోమయ్య, గుమ్మడి గురువమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని రేగళ్ల గ్రామ శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు, లక్ష్మీదేవిపల్లి పోలీసులు బుధవారం దాడి చేసి ఆరుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.39,530 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, మూడు బైకులను స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేశామని ఎస్‌ఐ కార్తీక్ తెలిపారు.

మొక్కలు నాటి రక్షించాలి

టీజీఎఫ్‌డీసీ చైర్మన్ పొదెం వీరయ్య



మొక్కకు నీళ్లు పోస్తున్న వీరయ్య, అధికారులు

చుంచుపల్లి: పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని, ఇందుకోసం మొక్కలు నాటి సంరక్షించాలని టీజీ ఎఫ్‌డీసీ చైర్మన్ పొదెం వీరయ్య అన్నారు. వనమహోత్సవంలో భాగంగా బుధవారం కొత్తగూడెం, పాల్వంచ డివిజన్ కార్యాలయంలో అటవీ అధి కారులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడుకుంటేనే మానవాళి మనుగడ సాధ్యమన్నారు. మానవాళికి ప్రాణవాయువు అందించే మొక్కల పరిరక్షణ బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్రభుత్వ, ఇతర ఖాళీ స్థలాల్లో విరివిగా మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ కిష్టాగౌడ్, ఎఫ్‌డీ ఓ కోటేశ్వరరావు, కొత్తగూడెం, పాల్వంచ, సత్తుపల్లి డీఎంలు చంద్రమోహన్, కవిత, గణేష్, డీఆ ర్ఓ తోలెం వెంకటేశ్వరరావు, లక్ష్మణ్, చారి పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించొద్దు

పాల్వంచ: విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని తెలంగాణా పవర్ ఎంప్లాయీస్ జేఏసీ నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. నేషనల్ కో ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్, ఇంజనీర్స్ పిలుపు మేరకు కేటీపీఎస్ జేఏసీ ఆధ్వర్యంలో 5, 6, 7 దశల కర్మాగారాల ఎదుట వేర్వేరుగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. జేఏసీ నాయకులు డి.ఉమా మహేశ్వరరావు, కోటేశ్వరరావు, డోలీ శ్రీనివాసరావు, అఖిలేష్, పుల్లారావు, కోటేశ్వరరావు, రవీందర్, పరశురాం, సురేంద్రాచారి, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, సీతారాంరెడ్డి, జయభాస్కర్, శ్రీపాల్, పావని, రజిత పాల్గొన్నారు.

శిథిల బడి.. సమస్యల ఒడి..!

- చింతగుప్పలో శిథిలమైన గిరిజన సంక్షేమ పాఠశాల
- పెచ్చులూడి పడుతున్న స్లాబు..
- పిల్లలను పంపేందుకు తల్లిదండ్రుల నిరాకరణ
- నిర్మాణంలో ఉన్న ఓ ఇంట్లో తాత్కాలిక నిర్వహణ



అసంపూర్తిగా ఉన్న ఓ ఇంట్లో తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం

చర్ల: మండలంలోని బోదనెల్లి పంచాయతీ పరిధిలోని చింతగుప్ప పూర్తిగా గిరిజనులే నివసించే గ్రామం. దీంతో అక్కడ సుమారు 40 ఏళ్ల క్రితం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జీవీవీకే(గిరిజన విద్యా వికాస కేంద్రం) కోసం భవనం నిర్మించి, ప్రైవేట్ టీచర్లతో బోధన కొనసాగించారు. ఆ తర్వాత జీపీఎస్(గిరిజన ప్రాథమిక పాఠశాల)గా అప్‌గ్రేడ్ చేసి ప్రభుత్వ ఉపాధ్యాయులను నియమించారు. అయితే నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన భవనం పదేళ్ల క్రితమే శిథిలావస్థకు చేరుకోగా.. అందులోనే తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం మరింత దెబ్బతిని స్లాబు పెచ్చులూడి పడుతున్నాయి.

20 మందికి పైగా విద్యార్థులు..

గ్రామంలో 48 కుటుంబాలు ఉండగా ఈ ఏడాది 1 నుంచి 5వ తరగతి వరకు 20 మందికి పైగా విద్యార్థులు జీపీఎస్‌లో చదువుతున్నారు. శిథిలమైన భవనాన్ని కూల్చాల్సి ఉన్నా ప్రత్యామ్నాయం లేకపోవడంతో స్థానిక అధికారులు అందులోనే బడిని కొనసాగిస్తున్నారు. గత పది రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో స్లాబు నుంచి లోపలికి నీరు వస్తుండడంతో పాటు పైపెచ్చులు ఊడి పడుతుండగా విద్యార్థులను బడికి పంపేందుకు తల్లిదండ్రులు నిరాకరించారు. అయితే తమ పిల్లలు చదువులో వెనుకబడతారనే భయంతో ప్రత్యామ్నాయం వెదుకుతుండగా.. పాఠశాల సమీపంలో ఓ వ్యక్తి గోడలు నిర్మించకుండా స్లాబు వేసిన ఇల్లు కనిపించడంతో గత వారం రోజులుగా అందులో పాఠశాల నిర్వహిస్తున్నారు. కాగా, ఐటీడీఏ పీఓ గతేడాది ఈ పాఠశాలను సందర్శించి నూతన భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా నిధులు మంజూరు చేసి పాఠశాల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నాలుగైదు ఏళ్లుగా భయపడుతున్నాం



పాఠశాల భవనం పూర్తిగా పాడైంది. నాలుగైదేళ్లుగా భయపడుతూనే పిల్లలను బడికి పంపించాం. ఈ ఏడాది మరింత శిథిలం కావడంతో ఇక పంపించొద్దనుకున్నాం. స్లాబు ఎప్పుడు కూలిపడుతుందో తెలియని పరిస్థితి ఉంది.

– కాకా నాగేశ్వరావు, చింతగుప్ప

ఇల్లు ఇవ్వాలని బతిమిలాడాం



మా ఊర్లో బడి పూర్తిగా శిథిలమైంది. పిల్లలను ఇక పంపించొద్దు అనుకున్నాం. అయితే మా బంధువు ఇల్లు కడుతుంటే గోడలు లేకున్నా సరే కొన్ని రోజులు బడికి ఇవ్వాలని కోరాం. ఆయన ఒప్పుకోవడంతో పిల్లలను పంపిస్తున్నాం. ఇకనైనా కొత్త భవనం నిర్మించాలి.

– సోడి రమేష్, గ్రామస్తుడు

చోరీ కేసుల్లో ముగ్గురి అరెస్ట్

36 తులాల బంగారం, 102 తులాల వెండి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, సీఐ వెంకటేశ్వర్లు

సుజాతనగర్: జిల్లాలోని సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి, బూర్గంపాడు, భద్రాచలం, అశ్వాపురం, మణుగూరు, చర్ల తదితర ప్రాంతాల్లో ఇళ్లల్లో చొరబడి చోరీలకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులతో పాటు, అపహరించిన బంగారాన్ని కొనుగోలు చేసిన వ్యాపారిని సుజాతనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ వివరాలు వెల్లడించారు. భద్రాచలం సీతారాం నగరం కాలనీకి చెందిన షేక్ ధారుక్‌బాబా చిన్నప్పటి నుంచి జల్సాలకు అలవాటై పదేళ్లుగా దొంగతనాలు చేస్తున్నాడు. ఇతను గతంలో పాల్వంచ, భద్రాచలం ప్రాంతాల్లో చోరీలకు పాల్పడగా అరెస్టయి కొన్ని నెలల పాటు జైలులో ఉండి వచ్చాడు. తరువాత మోతెకు చెందిన స్నేహితుడు అఖిల్‌తో కలిసి సుజాతనగర్‌లో ఒక చోరీ, మణుగూరుకు చెందిన మరో స్నేహితుడు సూర్యప్రకాశ్‌తో కలిసి బూర్గంపాడులో చోరీ, ఎటపాకకు చెందిన పేరాల నరసింహారావు, భద్రాచలానికి చెందిన అల్లాడ రవీందర్, ఖమ్మానికి చెందిన ఎండీ మతిన్‌తో కలిసి భద్రాచలంలో రెండు చోరీలకు పాల్పడ్డాడు. ఈ చోరీలే కాకుండా జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో 14 చోట్ల దొంగతనాలకు పాల్పడి బంగారం ,వెండి వస్తువులను దోచు కున్నాడు. ఇలా చోరీలతో వచ్చిన సొమ్ములో కొంత అఖిల్, సూర్యప్రకాశ్, నల్లమటి సాయిరాంకు ఇస్తుండేవాడు. బంగారు, వెండి వస్తువులను భద్రాచలంలోని బంగారు షాపు యజమానులైన వల్లే విజయరావు, గొర్ల శ్రీనుకు విక్రయించాడు. కొంత బంగారాన్ని అమ్మేందుకు మంగళవారం ద్విచక్రవాహనంపై ఖమ్మం వెళ్తుండగా వాహన తనిఖీల్లో సుజాతనగర్ పోలీసులకు పట్టుబడినట్లు డీఎస్పీ వెల్లడించారు. ధారుక్‌బాబా, నలమటి సాయిరాం, బంగారు, వెండి వస్తువులు కొన్న వల్లే విజయరావును అరెస్ట్ చేశామని, వారి నుంచి 36 తులాల బంగారం, 102 తులాల వెండి, ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో చుంచుపల్లి సీఐ రాయల వెంకటేశ్వర్లు, సీసీఎస్ సీఐ రమాకాంత్, ఎస్‌ఐలు ఎం. రమాదేవి, ప్రవీణ్, క్లూస్ టీం సీఐ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో సైన్స్ ఎక్స్‌పో



సైన్స్ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న కాశీనాథ్

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో బుధవారం సైన్స్ ఎక్స్‌పో కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా వరంగల్ ఎన్ఐటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ ప్రొఫెసర్ డి.కాశీనాథ్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మానవ జీవన గమనంలో ప్రతి దశలో సైన్స్ అంతర్భాగమన్నారు. సైన్స్ లేకపోతే జీవితమే లేదని, సైన్స్, సమాజం రెండూ అవినాభావ సంబంధాన్ని కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. వేప, పసుపు వంటి సంప్రదాయ ఔషధాల ఉపయోగాల గురించి, జన్యుపరమైన కేన్సర్‌ను గుర్తించే నానో టెక్నాలజీ అప్లికేషన్స్ ఆవశ్యకతను వివరించారు. గౌరవ అతిథిగా హాజరైన సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్ మాట్లాడుతూ.. భారతీయులు నిరంతర అన్వేషకులని తెలిపారు. మరో గౌరవ అతిథి జీకే కిరణ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శారద కూడా మాట్లాడారు. వివిధ విద్యాసంస్థల నుంచి 55 మంది విద్యార్థినులు సైన్స్ ప్రాజెక్టు ప్రదర్శనలు ఇచ్చారు. ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు అందజేశారు. మొదట కార్యక్రమ నిర్వాహక కార్యదర్శి డాక్టర్ జి.శైలజ కార్యక్రమ నివేదికను చదివి వినిపించారు. కార్యక్రమంలో కె.శ్రీలత, డాక్టర్ సీహెచ్ పావని, ఎం.పుష్పలత, కె.స్వర్ణలత, బి.సరోజ, డాక్టర్ కె.రాజ్యలక్ష్మి, షాషేదా పర్వీన్, కె.ఉషారాణి, వి.రేణుక, వి.శ్రీలత, జె.రోజా, ఎస్.ఆకాంక్ష తదితరులు పాల్గొన్నారు.

బాలుడిని రక్షించిన వైద్యులు



అపస్మారక స్థితిలో ఉన్న బాలుడు

భద్రాచలంఅర్బన్: కరకగూడెం మండలంలో పద్మాపురం గ్రామానికి చెందిన రెండున్నర ఏళ్ల బాలుడిని భద్రాచలం ఏరియా ఆస్పత్రి వైద్యులు ప్రాణాపాయం నుంచి కాపాడారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సారయ్య, నాగమణి దంపతులు తమ కుమారుడు విక్రమాధిత్యను ఓ విషపురుగు కాటేసిందని మంగళవారం సాయంత్రం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. బాలుడు అపస్మారక స్థితిలో ఉండి, నోటి నుంచి నురగలు కక్కుతున్నాడు. కాటేసిన ఆనవాళ్లు లేకపోవడంతో వైద్యులు కొంత సందేహించినప్పటికీ, 8 గంటల పాటు శ్రమించి తేలు, పాము కాటుకు అందించే చికిత్స అందించారు. బాలుడు కోలుకోవడంతో బుధవారం మధ్యాహ్నం డిశ్చార్జి చేసినట్లు ఏరియా ఆస్పత్రి వైద్యులు తెలిపారు. బాలుడిని రక్షించేందుకు కృషి చేసిన వైద్యులు రజశేఖర్‌రెడ్డి, కైలాష్‌మోహన్‌ను ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ అభినందించారు.

భవనం.. భయానకం

- భద్రాచలంలో ప్రమాదకరంగా 131 శిథిల భవనాలు
- వాటి తొలగింపుపై మీనమేషాలు
- ప్రమాదాలు జరిగినప్పుడే హడావుడి
- నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్న అధికారులు



శిథిల భవనాల యజమానులకు నోటీసులు అందజేస్తున్న గ్రామ పంచాయతీ అధికారులు (ఫైల్)



ప్రహరీ కూలి మృతి చెందిన వ్యక్తి (ఫైల్)

భద్రాచలంఅర్బన్: భద్రాచలం గ్రామ పంచాయతీ పరిధిలో శిథిల భవనాలు ప్రాణసంకటంలా పరిణమిస్తున్నాయి. అవి ఎప్పుడూ కూలుతాయో తెలియదు. వాటిని గుర్తించి కూల్చివేస్తే పెనుముప్పును తప్పించినట్లే. భారీ వర్షాలు కురిసే ముందే కార్యాచరణకు దిగాల్సిన అవసరం ఉంది. ఇటీవల భద్రాచలంలో వరుసగా కురిసిన వర్షాలకు గోడలు నాని ఉంటాయి. ఈ క్రమంలో వర్షాలు అధికంగా కురిసి, భవనాలు కూలితే ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంటుంది. ఇలాంటివి చోటుచేసుకోకముందే భద్రాచలం గ్రామ పంచాయతీ అధికారులు కఠినంగా వ్య వహరించాల్సి ఉంది. ఈ ఏడాది రెండు నెలల వర కు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. దీంతో పాత భవనాలు నాని కూలే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు అలాంటి భవనాలపై నిఘా ఉంచి, పట్టణంలో ఉన్న శిథిల భవనలను నేలమట్టం చేయాలి.

అడ్డగోలుగా నిర్మాణాలు..

భద్రాచలం పట్టణంలోని గ్రామ పంచాయతీ పరిధిలో భవన నిర్మాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. అయితే, ఆయా నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయా? లేవా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఒకటి, రెండు అంతస్తులకు అనుమతు లు తీసుకుంటున్న యజమానులు నాలుగు నుంచి ఐదు అంతస్తులను నిర్మిస్తున్నారు. ఇక బిల్డర్లు ఏ మేరకు నాణ్యత పాటిస్తున్నారనేది కూడా తెలియని పరిస్థితి నెలకొంది. లాభాల కోసం భవనాలను నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నారనే విమర్శలున్నా యి. ఇటీవల భద్రాచలం నిబంధనలకు విరుద్ధంగా జీ+1కు అనుమతి తీసుకుని జీ+3, జీ+4, జీ+5 అంతస్తులకు స్లాబ్ వేసినవి 130 భవనాలు ఉన్నాయి. వీటిలో కేవలం 15 మంది యజమానులకే నోటీసులు జారీ చేసి వారి నుంచి భారీగా జరిమానాలు వసూలు చేశారు.

23 భవనాలకు నోటీసులు..

భద్రాచలం పట్టణంలో 23 శిథిలావస్థ భవనాలను గుర్తించి నోటీసులు జారీ చేశారు. అందులో 5 ఇళ్లు ఇటీవల దేవస్థానం అభివృద్ధిలో భాగంగా తొలగించినట్లుగా సమాచారం. మరో 18 భవనాలు అలాగే ఉన్నాయి. పూర్తిగా శిథిలమైన భవనాలు తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇవే కాకుండా భద్రాచలం పట్టణంలో పలు చోట్ల పాత భవనాలు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటిని అధికారులు గుర్తించడం లేదనే విమర్శలున్నాయి. అలాగే, పాత భవనాలపై కొత్త నిర్మాణాలు చేపడుతున్నారు. ఓ పాత భవనంపై నిర్మాణం చేపడుతున్న క్రమంలో ఈ ఏడాది మార్చి 26న శ్రీపాద శ్రీపతికి చెందిన భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు శిథిలాల మధ్య చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు. గత ఏడాది ఆగస్ట్ 4వ తేదీన వర్షానికి నాని తాతగుడి సెంటర్‌లో ప్రహరీ కూలి ఓ వ్యక్తి మృతిచెందాడు. పాత భవనాల పరిస్థితి ఏమిటనేది కూడా తెలుసుకోకుండా అను మతులు ఎలా ఇస్తున్నారనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. సంబంధిత అధికారులు కూడా అనుమతులు ఇచ్చేటప్పుడు ఆయా స్థలాలను పరిస్థితిని పరిశీలించకుండా అంచనావేయడం లేదని విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

నల్ల బ్యాడ్జీలతో ఆలయ ఉద్యోగుల నిరసన



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, సిబ్బంది

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థాన ఈఓ రమాదేవిపై దాడిని నిరసిస్తూ టీఎన్‌జీవోస్ డివిజన్ శాఖ, భద్రాద్రి దేవస్థానం ఉద్యోగుల సంక్షేమ సంఘం, విశ్రాంత ఉద్యోగుల సంఘం, వివిధ దేవస్థానాల వైదిక పరిపాలన సిబ్బంది సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం తానీషా కల్యాణ మండపం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఆలయ భూములను పరిరక్షించడానికి వచ్చిన దేవస్థానం సిబ్బందిపై అభ్యంతరకరంగా మాట్లాడటమే కాకుండా దాడి చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. బాధ్యులపై ఏపీ ప్రభుత్వం, పోలీసు అధికారులు చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, భద్రాద్రి రామయ్య భూముల్లో ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు చోటుచేసుకోకుండా పగడ్బందీగా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. కాగా, నిరసన కార్యక్రమానికి శ్రీ కుసుమ హరినాథ్ బాబా ఆలయ పాలకమండలి సభ్యులు బుధవారం మద్దతు తెలిపారు. కార్యక్రమంలో డెక్క నరసింహారావు, గగ్గూరి బాలకృష్ణ, ఏఈఓ భవానిరామకృష్ణారావు, రవీంద్రనాథ్, విశ్రాంత ప్రధాన అర్చకులు పొడిచేటి రామచంద్రాచార్యులు, కుసుమ హరినాథ ఆలయ చైర్మన్ యక్కటి శ్రీనివాసరావు సభ్యులు తంబళ్ల కృష్ణార్జునరావు, పునుగుపాటి సీత, తంగెళ్ల సుజాత పాల్గొన్నారు.

భద్రాద్రి ఈఓపై దాడి బాధాకరం

దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రి రాముల వారి భూములు కబ్జా చేయడంతోపాటు అడ్డుకునేందుకు వెళ్లిన ఈఓ రమాదేవి, సిబ్బందిపై దాడి చేయడం బాధాకరమని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భద్రాద్రి రాముడిపై భక్తితో దాదాపు 900 ఎకరాల స్థలాన్ని ఓ దాత దానం చేశారని, ఇదే విషయంలో గతంలో దేవాలయ గోశాలను కూడా కబ్జా చేస్తూ.. వెళ్లేందుకు దారి మూసివేసిన విషయంపై విశ్వహిందూ పరిషత్ ఆందోళన చేసిందని గుర్తు చేశారు. ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం భద్రాద్రి రాముడి భూముల రక్షణకు ప్రత్యేక కమిటీ వేసిందని పేర్కొన్నారు. కానీ, నేడు కబ్జాదారులు చెలరేగిపోవడం.. ఏకంగా ఆలయ ఈఓ పైనే దాడి చేయడం అత్యంత హేయమైన చర్య అని మండిపడ్డారు. భద్రాద్రి రాములలోరి అంగుళం భూమి కూడా వదులుకునేది లేదని స్పష్టం చేశారు. కాగా, భద్రాచలం ఆలయ ఈఓ రమాదేవిపై దాడి హేయమైన చర్య అని బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రేగాకు మాతృవియోగం

సంతాపం తెలిపిన మాజీ సీఎం కేసీఆర్



అంతిమయాత్రలో రేగాతో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు తదితరులు, (ఇన్‌సెట్) రేగా నర్సమ్మ (ఫైల్)

కరకగూడెం/బూర్గంపాడు: బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు తల్లి నర్సమ్మ (85) బుధవారం తెల్లవారుజామున మండలంలోని కుర్నవెల్లిలో స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమె మృతి సమాచారం తెలియగానే మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తదితరులు కాంతారావును ఫోన్‌లో పరామర్శించారు. అలాగే, మాజీ ఎమ్మెల్యేలు హరిప్రియ, చందా లింగయ్య, తాటి వెంకటేశ్వర్లు, మెచ్చా నాగేశ్వరరావుతో పాటు నాయకులు ఏనుగుల రాకేశ్‌రెడ్డి, బడే నాగజ్యోతి, లక్ష్మణ్, తుళ్లూరి బ్రహ్మయ్య, చందా సంతోష్‌కుమార్, నబీ, జాఫర్ హుస్సేన్, గిన్నారపు రాజేశ్, హరిప్రసాద్‌యాదవ్, చాంద్‌పాషా, ఉపేందర్ నరసమ్మ మృతదేహం వద్ద నివాళులర్పించి ఆమె అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కాగా, రేగా కాంతారావును రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పరామర్శించారు. ఎంపీ హైదరాబాద్ నుంచి వచ్చేలోగా నరసమ్మ అంత్యక్రియలు పూర్తికావడంతో రేగా నివాసంలో ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

విషాదం మిగిల్చిన విహారయాత్ర

జలపాతంలో మునిగి యువకుడు మృతి

ఇల్లెందురూరల్: విహారయాత్రకు వెళ్లిన యువకుడు జలపాతంలో మునిగి మృతిచెందిన ఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని బాలాజీనగర్ జీపీ సంజయ్‌నగర్‌కు చెందిన ఇనుపసత్తుల కృష్ణయ్య కుమారుడు కిరణ్ (25) పట్టణంలోని ఓ రెస్టారెంట్‌లో పనిచేస్తున్నాడు. సమ్మె వల్ల సెలవు లభించడంతో నలుగురు స్నేహితులతో కలిసి మండలంలోని పూబెల్లి అటవీ ప్రాంతంలోని సిరిగుండం జలపాతం వద్దకు వెళ్లాడు. స్నేహితులంతా సాయంత్రం వరకు ఆడుతూ పాడుతూ గడిపారు. మరికొద్దిసేపట్లో ఇంటికి వెళదామనుకున్న తరుణంలో రాళ్లపై నడుస్తున్న కిరణ్ జారి నీటిలో పడిపోయాడు. తనతో వచ్చిన స్నేహితులకు ఈత రాకపోవడంతో నీటిలో కిరణ్‌ను కాపాడలేకపోయారు. కొద్దిసేపటికే కిరణ్ విగతజీవిగా నీటిలో తేలియాడుతూ కనిపించాడు. విషయం తెలుసుకున్న పూబెల్లి పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ సిబ్బంది ద్వారా కిరణ్ మృతదేహా న్ని బయటకు తీసి దండగుండాల వరకు చేర్చారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ ప్రారంభించారు.

రేగులగండి చెరువులో కార్మికుడి గల్లంతు



చెరువులో గాలిస్తున్న రెస్క్యూ సిబ్బంది, (ఇన్‌సెట్) సుంకరి శ్రీనివాస్ (ఫైల్)

మణుగూరుటౌన్: సమ్మె నేపథ్యంలో ఆటవిడుపుగా రేగులగండి చెరువుకు వెళ్లిన కార్మికుల బృందంలో ఒకరు గల్లంతైన ఘటన కలకలం సృష్టించింది. తోటి కార్మికుల కథనం ప్రకారం.. సింగరేణి కాల రీస్ మణుగూరు ఏరియాలోని పీకేఓసీ కార్మికులు సుమారు 15 మంది బృందంగా ఏర్పడి కూనవరం పంచాయతీలోని రేగులగండి వద్దకు వెళ్లారు. సాయంత్రం ఈతకు దిగిన ఓసీ–2 ఈపీ ఆపరేటర్ సుంకరి శ్రీనివాస్ ఎంతకూ బయటికి రాకపోవడంతో రెస్క్యూ సిబ్బందికి, జాలర్లకు సమీప గ్రామస్తులకు సమాచారం అందించగా.. వారు వచ్చి గాలించినప్పటికీ ఫలితం లేకపోయింది. గురువారం ఉదయం 8 గంటలకు గాలింపు చర్యలు చేపడతామని రెస్క్యూ సిబ్బంది పేర్కొన్నారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

దమ్మపేట: వివాహం జరిగి ఏడాది కూడా నిండకముందే వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని గండుగులపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని గండుగులపల్లి గ్రామానికి చెందిన కుంట ఏడుకొండలుకు ఏపీలోని ఏలూరు జిల్లా చింతలపూడి మండలం కొమ్ముగూడెం గ్రామానికి చెందిన యతిరాజు కృప (19)కు ఎనిమిది నెలల కిందట పెళ్లి అయింది. కొంతకాలంగా ఏడుకొండలు తన భార్యను అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేయడమే కాకుండా వేరే మహిళతో ప్రేమ వ్యవహారం నడుపుతున్నాడు. జీవితంపై విరక్తి చెందిన కృప.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుప్పటితో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి వీరకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి

బూర్గంపాడు: గత నెల 26వ తేదీన పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు చికి త్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని సందెళ్లరామాపురం గ్రామానికి చెందిన కారం సందీప్ (16) జూన్ 26వ తేదీన ఇంట్లో పురుగుమందు తాగాడు. అప్పటి నుంచి భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. అయితే, పదో తరగతి పూర్తిచేసిన సందీప్‌ను పైచదువులు చదువుకోవాలని కుటుంబ సభ్యులు చెప్పడంతో అది ఇష్టం లేని అతను ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రామాలయంలో చోరీ



హుండీ పగులగొట్టిన దృశ్యం

మణుగూరుటౌన్: స్థానిక పీవీ కాలనీలోని రామాలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. రోజూమాదిరిగానే మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో ఆలయానికి తాళాలు వేసి వెళ్లిన ఆలయ పూజారి బుధవారం తెల్లవారుజామున వచ్చి చూసే సరికి హుండీ పగులగొట్టినట్లు గుర్తించాడు. రూ.2 వేల వరకు హుండీలో భక్తుల కానుకలు ఉండొచ్చని కమిటీ సభ్యులు భావిస్తున్నారు. ఈ విషయమై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.